# చిన్నపాప

కనకదండి గోపాలకృష్ణశాస్త్రిగారు

తలంటిబొట్టుపెట్టి దొండకాయచేతికిఇచ్చి చావడిలో చదరమీదపక్క వేసి పడుకోపెట్టి పనులుచక్కబెట్టుకోడానికి తల్లి లోపలికివెళ్ళిపోయింది.

ఎనిమిదినెలలచిన్నబిడ్డ. బోర్లపడుకొని యెర్రనిదొండకాయని కొరుకుతూ తనలో తను నవ్వుకుంటూ కేకలువేస్తూ కులాసాగా ఆడుకుంటోంది. గోధుం తాచు ఎక్కడనుంచోవచ్చి పాపముందరినుంచి వెళ్లిపోతోంది. పాపదాన్ని చూచి దొండకాయవదలి నడుముదగ్గర చిన్నవేళ్లతో రెండుచేతులతోను పట్టుకుంది. మధ్యమధ్య బోసిపళ్లనోటితో నడుముమీద కొరుకుతూ ఆడుకుంటోంది. పాముకూడా పాపనిఏమీఅనకుండా పాపతోఆడుకుంది. వెళ్లిపోదామంటే పాప వదలకుండా గట్టిగా అలాగేపట్టుకునివుంది.

తల్లి ఏదోపనిమీద చావడిలోకివచ్చింది. పాపని పాముతో ఆడుకుంటూంటే చూచింది. నీరైపోయింది. గబగబామాటాడకుండా భర్తను పిలుచుకువచ్చింది. శ్వాసవిడుస్తే పాపనిపాము ఏంచేస్తుందోఅని ఇద్దరూ శ్వాసవిడవకుండా పొంచిచూస్తూన్నారు. ఏమీచేయలేరు పాపం! అలికిడి అయితే ప్రమాదము. ఏమిచేయకుండా ఊరుకోటానికి ప్రాణంఒప్పదు. ఒప్పకఏమిచేదామన్నా వీలులేదు.

పాము పడగ బాగావిప్పి పాపముఖముదగ్గరపెట్టింది. పాప ఆపడగతో ఆడుకుందామని నడుమువదలి పడగ పట్టుకోబోయింది. చిన్నచేతులు చాచేసరికి పాము తప్పించుకొని దొడ్లోకంచెల్లోకి పారిపోయింది. పాపగొల్లుమంది.

తల్లితండ్రులు గబగబావచ్చి పాపనుముద్దాడేరు సంతోషంతో. పాప మాత్రం ఒక్కపెట్టున ఏడుస్తూనేవుంది. భయపడ్డారు ఇద్దరూను. పాముకరచిందేమోఅనిచూచారు. కాటులేదు. భర్త లోనికిపోయి ఆడుకొనే చిన్నరబ్బరు పామునుతెచ్చి పాపను చదరుమీదపడుకోబెట్టి చేతిలోపెట్టేడు. పాప ఏడుపంతా మింగేసి నవ్వుతూ కేకలువేస్తూ మళ్లీఆడుకోటం ప్రారంభించింది. తల్లి పాపను అప్పుడుముద్దాడి ఎంతోఆనందించి తనపనిమీద వెళ్లిపోయింది. పాపదాంతో కేకలువేస్తూ ఆడుకుంటోంది పాపం!